గ్రామస్థులంతా కదిలి.. వంతెన కట్టి!

● వాంకిడి, కాగజ్‌నగర్‌ల మధ్య రాకపోకలు ప్రారంభం


వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారధి

వాంకిడి, కాగజ్‌నగర్ మండలాల మధ్య రహదారి నిర్మాణంతోపాటు వంతెనల నిర్మాణానికి 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. రహదారితోపాటు, చిన్న ఒర్రెలపై వంతెనల నిర్మాణాలు పూర్తి కాగా, ఖనర్‌గాం సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. డిజైన్, తదితర కారణాలతో గుత్తేదారులు మారినా వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. వంతెన నిర్మాణం పూర్తయితే వాంకిడి, కాగజ్‌నగర్‌ల మధ్య దూరం తగ్గుతుంది. కానీ అసంపూర్తి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నాలుగేళ్ల నుంచి నందూపా, భీంపూర్ గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వాగుపై తాత్కాలిక వారధి ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఈ గ్రామాల ప్రజలు వాగుపై పైపులు అమర్చి తాత్కాలిక వారధితో పాటు రహదారిని ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు.


- న్యూస్‌టుడే, వాంకిడి

ట'మాట' అనలేం.. వెల్లుల్లి కొనలేం

● పండగ వేళ కొండెక్కిన 'కూరగాయలు'

మంచిర్యాల అర్బన్, వాంకిడి న్యూస్‌టుడే

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కుదేలైన పంట పొలాలు, కూరగాయల తోటలతో పట్టణాలకు పెద్ద కష్టమే వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతంతోపాటు సిద్దిపేట నుంచి వచ్చే కూరగాయలపై ఉమ్మడి జిల్లావాసులు ఆధారపడ్డారు. వేసవి కాలం మాదిరి వర్షాకాలంలోనూ విపణిలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు లేకపోవడం, శ్రావణం, గణపతి, దేవి నవరాత్రి ఉత్సవాలు వరుసగా రావడం ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.



కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి...



మార్కెట్‌లో మిర్చిబండ్లు, గప్‌చుప్‌ల వద్ద తప్పనిసరిగా ఉల్లి వాడుతారు. కొద్దిరోజులుగా ఉల్లి ధర దడ పుట్టిస్తుండడంతో వాటిని వాడటమే మానేశారు. ఎందుకంటే మార్కెట్‌లో దాని ధర కిలో రూ. 55. వేసవిలో రూ. 20 ఉన్న ఉల్లి రెట్టింపు కావడంతో వంటల్లో వాటిని వాడడం తక్కువ చేశారు. ఉమ్మడి జిల్లాకు కర్నూలు, సోలాపూర్ నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. నెల క్రితం వరకు కిలో రూ. 40 ఉన్న అలుగడ్డ ప్రస్తుతం రూ. 50 పలుకుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి అయ్యే ఆలుగడ్డ ధరలు ఇప్పట్లో తగ్గడం కష్టమే అంటున్నారు వ్యాపారులు.

ఇతర వాటి పరిస్థితి అంతే..

సంత రోజు కూరగాయలు కొనేందుకు వెళ్తే రూ.500 ఖర్చు అవుతున్నాయి. వారానికి ఇంత ఖర్చయితే ఎలా అని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ఆకుకూరల ధర కూడా పెరిగిపోయింది. కొత్తిమీర నాందేడ్ నుంచి దిగుమతి కావడంతో రూ.20 ఇస్తే కానీ చిన్న కట్ట ఇవ్వడం లేదు.



వెల్లుల్లిదీ అదే దారి..



కరోనా సమయంలో కిలో రూ.60 ఉన్న వెల్లుల్లి ధర కొద్దిరోజులుగా కిలో రూ.320కి చేరింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఉమ్మడి జిల్లాకు వెల్లుల్లి వస్తుంది. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి ధరలు హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. కొత్త పంట వచ్చే వరకు ఈ తిప్పలు తప్పవంటున్నారు.

వర్షాలతో తగ్గిన దిగుమతి

కొద్దిరోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగుకు ఇబ్బంది నెలకొంది. మంచిర్యాల మార్కెట్‌కు సిద్దిపేట, ఒంటిమామిడి, గంగాపూర్, కళ్యాణదుర్గం నుంచి కూరగాయలు వస్తుంటాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని మండలాల్లో టమాట, వంకాయ సాగు చేస్తున్నప్పటికీ తీగజాతి కూరగాయలకు ఇతర ప్రాంతాల మీద ఆధారపడాల్సిందే. నిర్మల్ జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలు ఎక్కువగా ఉంటాయి. కూరగాయల సాగు చాలా తక్కువ. ఈ జిల్లావాసులు మహారాష్ట్ర, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాల పంటలపై ఆధారపడుతున్నారు. కుమురంభీం జిల్లాలో రెబ్బెన మండలం గంగాపూర్‌లో కొంత కూరగాయలు సాగు చేస్తున్నప్పటికీ స్థానికంగా విక్రయించడంతోపాటు మంచిర్యాలకు దిగుమతి చేస్తున్నారు.

సామాన్యులకు శరాఘాతం

- గడ్డం మధుకిరణ్, ప్రైవేటు ఉద్యోగి, మంచిర్యాల



గత కొద్దిరోజులుగా కూరగాయల ధరల పెరుగుదల ఆందోళన కల్గిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి కూరగాయ, ఆకుకూర కొనాల్సిందే. టమాట ధర పెరిగిన కొనక తప్పడం లేదు. వీటికి తోడు ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరిగాయి. మార్కెట్‌కు రూ. 500తో వెళ్లినా వారం రోజుల పాటు సరిపడా కూరగాయలు రావడం లేదు. కూరగాయలకు బదులు పప్పులు వండాల్సి వస్తుంది.


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ వేణు

సమర్థంగా ఓటరు జాబితా రూపకల్పన

వాంకిడి, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ సమర్థంగా, వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల పాలనాధికారులు, అదనపు పాలనాధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్ల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ వేణుతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొన్నారు. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల నుంచి ఓటరు జాబితాలో వివరాల నమోదు కోసం నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కోసం ఫారం-19లో వివరాలు నమోదు చేసుకోవాలని వివరించారు.



మహాలక్ష్మిగా.. దుర్గమ్మ

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్‌లోని వాసవీమాత ఆలయంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రూ. 55,55,555 కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

మూడేళ్లలో నలుగురు చనిపోయారు



మా గ్రామంలో దేశీదారును విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. 20 సంవత్సరాలు నిండని నా కుమారుడు భగవంత్ దేశీదారు నిత్యం తాగేవాడు. వద్దని మందలిస్తే ఏడాది కిందట పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మా గ్రామంలో ఈ మూడు సంవత్సరాల కాలంలో నలుగురు యువకులు ఇదే విధంగా దేశీదారుకు అలవాటు పడి మృత్యువాత పడ్డారు.

దేశీ దారుణం

చేతికొచ్చిన సంతానం ఏ పనీపాట లేకుండా మత్తులో మునిగి తేలడం, ఇదేమని మందలిస్తే ప్రాణాలు తీసుకోవడం.. జిల్లాలో పరిపాటిగా మారుతోంది. చదువుకునే వయసులో, తల్లిదండ్రులకు అండగా ఉండే సమయంలో నిండా పాతికేళ్లు లేని యువకులు మద్యానికి బానిసలవుతున్నారు. దేశీదారును (మహారాష్ట్ర మద్యం) పల్లెల నుంచి తరిమేయాలని ఆయా గ్రామాల ప్రజలు మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు.



● పల్లెల్లో విచ్చలవిడిగా పారుగు మద్యం అమ్మకాలు.. గాలిలో కలుస్తున్న ప్రాణాలు

ఈనాడు, ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో దేశీదారును విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కెరమెరి, జైనూర్, వాంకిడి, సిర్పూర్-టి, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూరు మండలాలకు మహారాష్ట్ర గ్రామాలు సరిహద్దుగా ఉన్నాయి. ఆ రెండు రాష్ట్రాల మధ్య ప్రాణహిత, పెన్‌గంగ ఉండగా, ఈ ప్రాంతాల నుంచి దేశీదారు నిరంతరంగా జిల్లాలోని పల్లెలకు చేరుతోంది. వాంకిడి వద్ద ఉన్న ఒకే ఒక చెక్‌పోస్టు వద్ద ఎన్నడూ తనిఖీల ఊసే ఉండటం లేదు. ప్రతి వాహనం నుంచి ఇక్కడ డబ్బులు వసూలు చేయడం కొన్నేళ్లుగా సాగుతోంది. దేశీదారును అక్కడ ఒక్కో సీసా రూ.30-40 వరకు కొనుగోలు చేసి మన ప్రాంతాల్లో రూ.60 చొప్పున దళారులు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండడంతో మందుబాబులు దీనికే మొగ్గు చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 34 మద్యం దుకాణాలు ఉండగా, వందలాదిగా గొలుసు దుకాణాలు అన్నిచోట్లా కొనసాగుతున్నాయి. గొలుసు దుకాణాలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వీటిని రద్దు చేయాలని ఇటీవలే కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ మహిళలు రహదారులపై ధర్నా చేపట్టారు. మారుమూల పల్లెలతోపాటు, ప్రధాన రహదారులను ఆనుకుని కిరాణా దుకాణాల్లో వీటిని కొనసాగిస్తున్నారు. కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్, సిర్పూర్-బెజ్జూర్, ఆసిఫాబాద్-వాంకిడి ప్రధాన రహదారులపై పదుల సంఖ్యలో గొలుసు దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో మద్యం తాగిన చోదకులతో రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాకు మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి ప్రాంతాలు సరిహద్దులుగా ఉన్నాయి. గడ్చిరోలిలో మద్య నిషేధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సరిహద్దున ఉన్న గూడెం వద్ద అనేక గొలుసు దుకాణాలు వెలిశాయి. నిత్యం మందుబాబులతో ఈ ప్రాంతమంతా రద్దీగా మారుతోంది.

అధికారులు స్పందించాలి

కేశవరావు, గోయగాం



సులువుగా లభించే దేశీదారును గ్రామంలో లేకుండా చేయాలని పలు మార్లు అధికారులను కలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నా కుమారుడు భరత్(20) సైతం దేశీదారుతోనే అనారోగ్యం పాలై చనిపోయాడు. గ్రామంలో అనేక మంది యువకులు దేశీదారుకు బానిసలై ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి దేశీదారు రాకుండా తరిమేయాలి

తనిఖీలు చేస్తాం

జ్యోతికిరణ్, జిల్లా ఆబ్కారీ అధికారి

దేశీదారు అమ్మకాల గురించి ఫిర్యాదుల నేపథ్యంలో సిబ్బందితో తనిఖీ చేయిస్తాం. వీటిని ఎవరు విక్రయించినా కేసులు నమోదు చేస్తాం.

యశస్వీ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: ప్రధానమంత్రి యశస్వీ పథకం కింద ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ కోరారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.75 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షల చొప్పున ఉపకార వేతనం అందిస్తారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల వార్షిక ఆదాయం మించని వారు అర్హులన్నారు.. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


అలంకరణ సామగ్రి తీసుకుంటున్న మహిళలు

సంతలో.. దసరా సందడి

మండలంలో సద్దుల బతుకమ్మ, దసరా పండగలు పురస్కరించుకుని ప్రజలు మంగళవారం నిర్వహించిన వార సంతకు తరలివచ్చారు. వ్యాపార సముదాయాలు కిక్కిరిసిపోయాయి. దుస్తులు, కంగన్‌హాల్ సామగ్రి కొనుగోళ్లతో సంత సందడిగా మారింది. దుకాణాల వద్ద బారులు కనిపించాయి.

- న్యూస్‌టుడే, దహెగాం

ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న లారీ అసోసియేషన్

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ డిమాండ్లను సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం అంగీకరించే పరిస్థితిలో లేదని మిల్లు జనరల్ మేనేజర్ ఎం.ఎస్.గిరి పేర్కొన్నారు. మంగళవారం మిల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వారం రోజులుగా లారీ అసోసియేషన్ తమ కంపెనీలో ఉత్పత్తి చేసిన పేపర్ లోడ్‌ను అసోసియేషన్ లారీలు గమ్యస్థానాలకు పంపించకుండా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో కంపెనీకి భారీ నష్టం వాటిల్లుతుందన్నారు. 2023 సెప్టెంబరులో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మిల్లు ప్రతినిధులు, లారీ అసోసియేషన్ సభ్యుల మధ్య జరిగిన ఒప్పందం గడువు ముగియక ముందే డిమాండ్లతో ఆందోళన చేపట్టడం బాధాకరమని పేర్కొన్నారు. లారీ అసోసియేషన్ డిమాండ్లను అంగీకరించే ప్రసక్తి లేదని మేనేజర్ స్పష్టం చేశారు. చీఫ్ మేనేజరు ఎం.అనిల్‌కుమార్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎం.ఎస్.గిరి

బడి పంతులొస్తున్నారు..

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డీఎస్సీ నియామక ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదల కావడంతో.. అభ్యర్థులు, అధికారుల్లో ఉత్కంఠకు తెరపడింది. బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేసే ఏర్పాట్లు జరుగుతుండగా.. సోమవారం ఎంపిక అభ్యర్థుల జాబితా విడుదల చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ముమ్మర కసరత్తు చేసింది. డీఈవోలు, అభ్యర్థులు ఫలితాలపై ఆరాతీస్తూ వచ్చినా మంగళవారంతో నిరీక్షణకు తెరపడింది.

ఎంపికైన వారిని హైదరాబాద్‌కు తరలించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో.. ఆగమేఘాలమీద ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంటు జాబితా, రాత్రి 8 గంటల సమయంలో ఎస్జీటీల జాబితా డీఈవోలకు అందింది. డీఈఓ మంచిర్యాలలో ఉండటంతో ఆయన సంతకం, కలెక్టర్ సంతకం అయ్యాకే జాబితాను అధికారికంగా ప్రకటిస్తామని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు హైరానా పడ్డారు. కొందరు డీఈవో కార్యాలయానికి పరుగులు దీశారు. జాబితాలో ఉన్నవారికి వ్యక్తిగతంగా ఫోన్ సమాచారం ఇచ్చి ఎంపికైనట్లు తెలిపారు. వెంటనే కలెక్టరేట్‌కు వచ్చి బుధవారం తెల్లవారు జామున 2గంటలకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమై రావాలని ఆదేశించారు.



డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల్లో కలిపి స్కూల్ అసిస్టెంటు విభాగం గణితంలో 9, ఫిజికల్ సైన్సు 9, సాంఘిక 18, బయోసైన్సు 10, హిందీ 4, తెలుగు 3, ఆంగ్లం 4, లాంగ్వేజ్ పండిత్ 21 మందికి.. ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందనున్నాయి.

నా తొలి వేతనంతో అమ్మకు ఆభరణం

చిప్ప సుమిత, ఎస్ఏ బయోసైన్సు, కాగజ్‌నగర్



బాగా చదివి ఉద్యోగం చేయాలన్న కోరికతో నాన్న పదో తరగతి తర్వాత పెళ్లి చేస్తానన్నా ఒప్పుకోలేదు. ఆర్థిక పరిస్థితి బాగా లేక కాలేజీ చదువులు మానేద్దామనుకున్నా. ఆ సమయంలో అమ్మ పుస్తెలతాడు తాకట్టుపెట్టి చదివించింది. పెళ్లి తర్వాత భర్త రామకృష్ణ చదువు, ఉద్యోగం పట్ల నా శ్రద్ధను చూసి ప్రోత్సహించారు. 2010, 2017లో డీఎస్సీ రాసినా విఫలమయ్యా. గిరిజన సంక్షేమశాఖలో సీఆర్టీగా పనిచేస్తూ పరీక్షకు సిద్ధమయ్యా. అనుకున్నట్లే తొలి ర్యాంకుతో ఎస్ఏ బయోసైన్సు ఉద్యోగానికి ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది. నా తొలి వేతనం మా అమ్మ కోసం వెచ్చిస్తా. పుస్తెల తాడు చేయించి రుణం తీర్చుకుంటా.

ఓటమి కసిని పెంచింది

తుమ్మిడె కమలాకర్, ఎస్ఏ సాంఘిక, బెజ్జూరు



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు బుచ్చయ్య, లసుంబాయి. తొలిసారి 2017లో డీఎస్సీ రాసినా మంచి ర్యాంకు రాలేదు. ఈ ఓటమితో కసి పెరిగింది. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాలని వ్యవసాయ పనులు మానుకొని కాగజ్‌నగర్ గదిని అద్దెకు తీసుకొని సిద్ధమయ్యా. డీఎస్సీలో ఎస్ఏ సాంఘిక శాస్త్రంలో జిల్లాలో తొలి ర్యాంకు వచ్చింది. తొలి వేతనాన్ని నేను చదివిన మా పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటుకు ఖర్చు చేస్తా.

బీటెక్ చదివి బీఈడీ చేసి

గందె రంజిత్‌రాజ్, ఎస్ఏ గణితం, ఆసిఫాబాద్



తల్లిదండ్రులు నా చదువుల కోసం రాత్రింబవళ్లు దర్జీలుగా పనిచేశారు. పాఠశాల సమయంలో గణితం మాస్టారు తెలివైన వారు ఉపాధ్యాయులైతే సమాజం బాగు పడుతుందని చెప్పేవారు. అప్పుడే నేను టీచర్ కావాలనుకున్నాను. బీటెక్ చేసిన వారు కూడా బీఈడీ చేసే అవకాశం ఇవ్వడంతో పూర్తిచేశాను. గురుకుల టీజీటీ పోటీ పరీక్షల్లో జోనల్ స్థాయి 3వ ర్యాంకు సాధించాను. తొలి డీఎస్సీలోనే ఎస్ఏ గణితంలో తొలి ర్యాంకుతో ఉద్యోగం సాధించాను.


విద్యుద్దీపాలంకరణలో ఆలయం


గదులు లేకపోవడంతో ఆరుబయట నిద్రిస్తున్న భక్తులు

మూల నక్షత్ర వేడుకలకు బాసర సిద్ధం

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం బుధవారం మూల నక్షత్ర వేడుకలకు ముస్తాబైంది. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూల కావడంతో ఈ వేడుకలకు ప్రత్యేకత ఉంది. వేకువజామున రెండు గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు, హారతి, నివేదన కార్యక్రమాలు సాగుతాయి. ఈ శుభఘడియల్లో ఆలయంలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు రైళ్లు, బస్సులు, సొంతవాహనాల ద్వారా బాసరకు చేరుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బాసరకు భక్తుల రాక మొదలైంది. నవరాత్రి ఉత్సవాల్లో ఒకరోజు సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రం వస్తుంది. ఆ రోజు అమ్మవారి చెంత అక్షరాభ్యాసాలు నిర్వహిస్తే ప్రయోజకులవుతారని విశ్వాసంతో భక్తులు భారీగా తరలివస్తారు. అక్షరాభ్యాసాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.


క్యూలైన్లలో భక్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన బెంచీలు

ఏర్పాట్లు పూర్తి


సరస్వతి అమ్మవారి మూల నక్షత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్షరాభ్యాసాలు, దర్శనాలు, పూజల సమయంలో భక్తులకు సమస్యలు తలెత్తకుండా దేవాదాయశాఖ జాగ్రత్తలు తీసుకుంది. రద్దీకి అనుగుణంగా అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అదనపు టికెట్ కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఈసారి వీఐపీ పాసులను రద్దు చేశారు. ప్రముఖులకు దర్శనాలు చేయించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేసిన వారికి ప్రత్యేకంగా వరుస ఏర్పాటు చేసి వారికి దర్శనం కల్పించనున్నారు. ఉచిత దర్శనం, రూ.150 అక్షరాభ్యాసాలకు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి, ప్రత్యేక దర్శనం కోసం ఆలయాధికారి కార్యాలయం ఎదుటి నుంచి వరుసలను ఏర్పాటు చేశారు. వరుసలో ఉన్న భక్తుల కోసం క్యూలైన్లలో బెంచీలను ఏర్పాటు చేశారు. భద్రత, పార్కింగ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తుల సేవలకు పలు సంఘాలు, భక్తబృందాల సేవలను వినియోగించనుంది. పుణ్యస్నానాల వేళ భక్తుల భద్రత కోసం గోదావరి నది వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ నిజామాబాద్, భైంసా డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది.

నిండిన గదులు.. ఆరుబయటే భక్తులు

ఆలయానికి చెందిన వంద వసతి గదులు మరమ్మతుల్లో ఉండటం, మిగిలిన వసతి గృహాలు ప్రముఖులకే కేటాయించడంతో బాసరకు వచ్చే భక్తులకు వసతి కష్టాలు మొదలయ్యాయి. ప్రైవేట్ లాడ్జీల్లో గదుల ధరలు రెండింతలు చేశారు. దీంతో సామాన్య భక్తుల పరిస్థితి దారుణంగా తయారైంది. డబ్బు ఉన్న వారు ప్రైవేట్ గదులను అద్దెకు తీసుకున్నారు. డబ్బులు లేని వారు ఆరుబయటనే సేదతీరాల్సి వస్తోంది. కొందరు భక్తులు నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి పట్టణాల్లోనే బసచేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వీరంతా బుధవారం ఉదయం బాసరకు రానున్నారు.

ఆదిశక్తి ఆరాధన.. ఆడపిల్లకు నిరాదరణ

జిల్లాలోని ఓ మండలానికి చెందిన వ్యాపారికి తొలి సంతానంగా కుమార్తె పుట్టింది. రెండో కాన్పులో కూడా పాపేనని ముందుగానే తెలియడంతో మహారాష్ట్రలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. మగ బిడ్డ ఉన్నట్లు ముందే తెలుసుకున్నాడు. ఒక వేళ ఆడపిల్ల అంటే పరిస్థితి మరోలా ఉండేది.



నేడు పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిని ఆరాధించే ప్రజలే ఆడపిల్ల అంటే చిదిమేస్తున్నారు. శివుడిలో సగం.. అవనిలో సగం అంటూనే తమ ఇంట మాత్రం వదిలించుకోవాలని చూస్తున్నారు. కాసుల కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు పుట్టబోయేది ఆడ, మగ అనేది ముందే చెప్పేస్తూ.. భ్రూణహత్యలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో నిరక్షరాస్యత, పేదరికం కూడా వాటికి తోడవుతోంది.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం

ఇలా చేస్తే ప్రయోజనం..

- లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- వరకట్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వరకట్నం తీసుకున్నట్లు తెలిసిన వెంటనే విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి.
- ఆడపిల్లల చదువు కోసం గతంలో మాదిరిగా బంగారుతల్లి వంటి పథకాలను అమలు చేయాలి.
- ఆడ శిశువులకు జన్మనిచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి.
- స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం మరింత పెంచాలి.

లింగనిష్పత్తి (● బాలురు ● బాలికలు)

జిల్లా	బాలురు	బాలికలు
ఆదిలాబాద్	1000	989
నిర్మల్	1000	1046
కుమురం భీం	1000	998
మంచిర్యాల	1000	977

ఆందోళన కలిగిస్తున్న బాలబాలికల నిష్పత్తి

● జిల్లా ● 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు ● బాలురు ● బాలికలు

జిల్లా	0 నుంచి 6 ఏళ్ల పిల్లలు	బాలురు	బాలికలు
కుమురంభీం	66206	34053	32153
నిర్మల్	82769	42,462	40,307
మంచిర్యాల	73725	38578	35147
మంచిర్యాల	89,283	46,225	43058

ఆడపిల్లకు నిరాదరణ


మహారాష్ట్రలో లింగ నిర్ధారణ పరీక్షలు..

జిల్లాలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై అధికారుల నిఘా కరవైంది. గతంతో పోల్చితే నిర్ధారణ పరీక్షలు తగ్గినా.. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. కొంత మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఆడ, మగ అన్నది కోడ్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లావాసులు సరిహద్దులోని మహారాష్ట్రకు లింగ నిర్ధారణ పరీక్షల కోసం వెళ్తున్నారు. అక్కడి ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు డబ్బుల ఆశతో ఆడ, మగ అన్నది తెలియజేస్తున్నాయి. ఫలితంగా చాలా మంది అక్కడే గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేసుకుంటున్నారు.




ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి కారణాలు ఏమిటి? జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్ష నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నారా? ఆడపిల్లల సంఖ్య పెరగడానికి ప్రభుత్వం ఏం చేయాలన్న అంశాలపై జిల్లాలో 100 మందిపై 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

1 నేటి సమాజంలో చదువు, ఇతర విషయాల్లో ఆడ, మగ పిల్లలకు సమ ప్రాధాన్యం ఉందా?




2 లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, వరకట్న నిషేధం వంటి వాటి నియంత్రణ, మహిళల భద్రతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయా?



● జనాభా ● పురుషులు ● మహిళలు

జిల్లా	జనాభా	పురుషులు	మహిళలు
కుమురంభీం	5,15,812	258197	257615
నిర్మల్	709418	346721	362697
మంచిర్యాల	807037	408272	398765
ఆదిలాబాద్	7,08972	3,56,407	3,52,565



నేత్రపర్వం.. ధనలక్ష్మి రూపం

చెన్నూరు పట్టణంలోని ఆర్య వైశ్య సంఘ భవనంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి మండపాన్ని ఉత్సవ నిర్వాహకులు రూ.25,25,555 కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, చెన్నూరు


చెన్నూరులోని ఆర్యవైశ్య సంఘ భవనంలో దుర్గాదేవి మండపాన్ని రూ.25,25,555లతో అలంకరించిన నిర్వాహకులు

పసిపాప పాల కోసం ఆవు విరాళం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం టెంబ్రీగూడకు చెందిన పసిపాప దయనీయ పరిస్థితిని 'ఈనాడు'లో చూసి బోథ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.హుస్సేన్ చలించారు. మంగళవారం ఇచ్చోడ జై శ్రీరామ్ గోశాల నుంచి ఆవు, దూడను పసిపాప తండ్రికి అందజేశారు. దేశ్‌ముఖ్ మారుబాయి ఆడపిల్లకు జన్మనిచ్చిన 23 రోజులకే చనిపోయింది. తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం పడుతున్న పాట్లపై 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసి న్యాయమూర్తి స్పందించారు. ఆవును, దూడను వారికి ఇచ్చారు. గోశాల నిర్వాహకుడు రాజేశ్ ఉన్నారు. మరోవైపు మానవతావాదులు తమవంతుగా ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు విరాళాలు రూ.32,400 జమయ్యాయి.


పసిపాప తండ్రికి ఆవు, దూడను అందజేస్తున్న న్యాయమూర్తి హుస్సేన్

తాపీమేస్త్రీలు.. సహాయకులకు



దండేపల్లిలో గోడల నిర్మాణంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న చిత్రం ఇది. పునాది వేయడం దగ్గర నుంచి భవన నిర్మాణం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పగుళ్లు రాకుండా ఉండాలంటే సామగ్రి ఎంపికతో పాటు వీటిని ఏ నిష్పత్తిలో కలపాలి, సరైన కొలతల ప్రకారం ఎలా నిర్మించాలో తెలియజేస్తున్నారు. నాణ్యత, అందంగా ఉండటానికి చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

కూలీల కుటుంబ సభ్యులకు..



ఆదిలాబాద్‌లో మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణ చిత్రమిది. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. వీరికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందజేయనున్నారు. కూలీల కుటుంబ మహిళా సభ్యులతోపాటు గుర్తింపు కార్డు ఉన్న మహిళలకు సైతం శిక్షణ ఇస్తారు. కుట్టుతోపాటు ఎంబ్రాయిడరీ, కంప్యూటర్‌తో మెరుగులు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి బాసట

- దండేపల్లిలో పురుషులతోపాటు మహిళలకు శిక్షకుడు వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కూలీలు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబరు, వెల్డింగ్, పెయింటింగ్ తదితర వృత్తుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. 15 రోజులపాటు శిక్షణ ఇవ్వడంతోపాటు రోజుకు రూ.300లతో పాటు దుస్తులు, హెల్మెట్ అందజేస్తారు.

దండేపల్లి, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు మహిళలు సైతం వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. తమలోని సృజనాత్మకతతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. భవన నిర్మాణ మేస్త్రీల దగ్గర నుంచి కుట్టు మిషన్, ప్లంబర్, గోడలకు పెయింటింగ్ ఇలా పలు రంగాల్లో రాణిస్తూ మార్పులకు అనుగుణంగా తమ వృత్తులను మెరుగుపర్చుకుంటున్నారు. వీరిలో ఉన్న వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు జాతీయ నిర్మాణ అకాడమీ(న్యాక్) యువతకు శిక్షణ ఇస్తోంది. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న నిరుద్యోగ పురుషులతో పాటు మహిళలకు సైతం తరగతులు నిర్వహిస్తూ వృత్తులపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గోడలకు రంగులు వేయడంపై శిక్షణ పొందుతున్న మహిళలు

రుణాలు పొందే అవకాశం

ఎం.నాగేంద్రం, న్యాక్ సహాయ సంచాలకుడు(ఏడీ), ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా



న్యాక్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీల నుంచి వివిధ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులపాటు తరగతులు నిర్వహిస్తూనే, క్షేత్రస్థాయిలో వివిధ అంశాల్లో మెలకువలు నేర్పుతున్నాం. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతో పాటు నిబంధనల మేరకు రుణాలు అందించే అవకాశం ఉంది.

ఉపయోగకరంగా ఉంది: చింతల లహరి, కిష్టాపూర్, జన్నారం మండలం



వారం రోజులుగా దండేపల్లిలో నిర్వహిస్తున్న కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాను. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ మాతో పనులు చేయిస్తున్నారు. కుట్టుతోపాటు తాపీమేస్త్రీ, సిమెంటు పనులపై శిక్షణ తీసుకుంటున్నాం. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి పట్టణం: నకిలీ నియామక పత్రాలు అందజేస్తున్న బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలో విద్యాంజలి 2.0 ప్రత్యేక పోర్టల్‌ను తీసుకొచ్చిందన్నారు. కొంతమంది ఈ పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ ఉచితంగా వాలంటీర్లను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తామని నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

గ్రామీణ నేపథ్యం.. అరుదైన అవకాశం

ఆ విద్యార్థులది గ్రామీణ నేపథ్యం. చదువంటే ఎంతో మక్కువ. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు వివిధ అంశాల్లోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారిలోని సృజనాత్మకతను గుర్తించి 28వ 'ప్రేరణ' జాతీయ సదస్సుకు ఎంపికయ్యే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చదువుకున్న గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలలో సెప్టెంబరు 21-28 తేదీల మధ్య నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. తెలంగాణ నుంచి కేవలం ఒక్క నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే చోటు లభించడం విశేషం.

-న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, గైడ్ టీచర్

- 'ప్రేరణ' జాతీయ సదస్సు.. రాష్ట్రం నుంచి నిర్మల్ జిల్లా విద్యార్థులు

మామడ మండలం కొరటికల్‌కు చెందిన ఎం.రాజేందర్-లక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ ప్రస్తుతం స్వగ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి కులవృత్తి నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. చదువే ధ్యేయంగా నిత్యం పరితపిస్తూ ముందుకెళ్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి ముఖదంగూడ గ్రామానికి చెందిన ఎస్.హరీంద్రకుమార్-శ్వేత దంపతుల కూతురు ఎస్.హర్షిత నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రైవేటు అధ్యాపకుడు, తల్లి గృహిణి. అయిదో తరగతిలో పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యాలయంలో సీటు సంపాదించాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రేరణ మహోత్సవం'లో భాగంగా 'ఏక్ భారత్-వికసిత్ భారత్' పేరిట పాఠశాల, జిల్లా స్థాయిలో సహపాఠ్యాంశాలైన వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటికి కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఏప్రిల్-మే నెలలో నిర్వహించిన పోటీల్లో వీరిని ఎంపిక చేశారు.


గుజరాత్‌లోని మ్యూజియం విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న గైడ్

ప్రప్రథమంగా..

ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయ సదస్సుల్లో జిల్లా నుంచి ఎంపికైన వారు లేరు. 28వ ప్రేరణకు మాత్రం రాష్ట్రం నుంచి అదీ నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వడం చెప్పుకోదగ్గ విషయం. వీరికి గైడ్ టీచర్‌గా నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయం పీజీటీ (ఆంగ్ల బోధకురాలు) బి.కల్పన వ్యవహరించారు. వీరితోపాటు అసోం, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థిని, విద్యార్థులకు చోటు లభించింది. ప్రయోగాత్మక, బోధనోపకరణాలు, విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని నిపుణులైన నవోదయ విద్యాలయాలకు చెందిన సీనియర్ బోధకులు వివరించారు. సత్యం, అహింస, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, చరిత్రాత్మకమైన వాటి విశేషాలు సదస్సులో చెప్పారు. సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములయ్యేలా చైతన్యం తీసుకొచ్చేలా బోధించారు. శిక్షణతోపాటు అక్కడి విశేషాలు, చరిత్రాత్మక ప్రాంతాలను సందర్శించామని, ఇది ఎంతో గొప్ప అవకాశమని వారు వెల్లడించారు.

జిల్లాకు గర్వకారణం:

రవీందర్‌రెడ్డి, డీఈఓ, నిర్మల్

'ప్రేరణ' జాతీయ స్థాయి సదస్సుకు రాష్ట్రం నుంచే జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై అక్కడ శిక్షణ పొంది రావడం గర్వకారణం. ఈ కార్యక్రమం వారిలో ఆత్మస్థైర్యం, భవిష్యత్తులో లక్ష్య సాధనకు దిక్సూచిలా మారనుంది. పోటీ పరీక్షలకు మార్గదర్శకం. ఏకాగ్రత, చదువుపై మక్కువ పెరుగుతుంది. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించేలా ఏటా జిల్లా నుంచి ప్రాతినిధ్యం లభించేలా పిల్లలను తీర్చిదిద్దేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ పట్టణంలో కలకలంగా మారింది. తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన గౌడు రాజు(25)-గౌడు వైష్ణవి(22)లకు మూడేళ్ల కిందట వివాహమైంది. వైష్ణవి ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు మొదటి ఏడాది చదువుతోంది. ఇటీవల ఆమె జైనథ్ మండలం మాండగడలోని తల్లి గారింటికి వెళ్లింది. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేసి రావాలని చెప్పింది. దీంతో ఆయన ఆదిలాబాద్‌కు రాగా ఇద్దరు కలిసి స్థానిక గాంధీ ఉద్యానవనానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు పురుగు మందు తాగేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తమను కలిసి ఉండనివ్వడం లేదని, తరచూ వేధిస్తున్నారంటూ వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను విచారించగా దంపతులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన విషయమై ప్రాథమిక విచారణ జరుపుతున్నామన్నారు. ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. న్యాయమూర్తి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066
(10 AM TO 1 PM)

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:
? కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి పంచాయతీ పరిధిలోని జీడు చేను నుంచి బామనిచేను రోడ్డును ముళ్ల పొదలు ఆవరించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - **కోట హరీష్, స్థానికుడు**
✔ రెండు రోజుల్లోగా ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్**

పశువుల పట్టివేత

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణం మీదుగా జగిత్యాల వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు గ్రామీణ ఎస్సై మహేందర్ తెలిపారు. గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా.. వినయ్ గార్డెన్ వద్ద రెండు బొలెరో వాహనాల్లో ఆరు పశువులు, దాడానగర్ సమీపంలో మూడు వాహనాల్లో 9 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను సీజ్ చేయడంతో పాటు పశువులను గోశాలకు తరలించామని, పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిందితులైన దాడానగర్‌కు చెందిన సయీద్ సమీర్, పెద్దపల్లి జిల్లా కొత్తూరుకు చెందిన కొమ్మ కుమారస్వామి, అబ్బాపూర్‌కు చెందిన కొమ్మ కుమార్, చింతలమానెపల్లి మండలం బాబాపూర్‌కు చెందిన నక్క శేఖర్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన షేక్ గౌస్, కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లికి చెందిన పెర్క లింగమూర్తి, రాస్పెల్లికి చెందిన మారిశెట్టి సత్తయ్యలతో పాటు గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామానికి చెందిన మద్దెల గంగాధర్, కౌటాలకు చెందిన అనంతుల భగవాన్, కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని ధర్మరాజులపల్లికి చెందిన జక్కుల జానయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.


పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న వాహనం

జూదరులపై కేసు నమోదు

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని బనార్‌కోసార గ్రామంలో మంగళవారం ఉదయం జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.2,200 లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఎస్సై విక్రమ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎల్కపల్లి గ్రామస్థులు

మద్యపాన నిషేధానికి గ్రామస్థుల తీర్మానం

బెజ్జూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో మద్యపాన నిషేధానికి మంగళవారం గ్రామస్థులందరూ తీర్మానించుకున్నారు. మద్యం తాగడంతో ఆరోగ్యపరంగా నష్టపోతున్నారని, కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మద్యం అమ్మకాలు, తాగేందుకు నిషేధం విధించాలని గ్రామస్థులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈమేరకు సహకరించాలని కోరుతూ వారంతా ఎస్సై విక్రమ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. గ్రామస్థులు తీసుకున్న నిర్ణయానికి తమవంతు సహకరిస్తామన్నారు. గుడుంబా సరఫరా చేసినా, విక్రయించిన తమకు సమాచారం ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అధికారి చొరవ..


నిలిచిన ఇసుక అక్రమ రవాణా

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణాపై కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కొరడా ఝుళిపించారు. మండలంలోని రాస్పెల్లి, వంజీరి, అందవెల్లి, భట్టుపల్లి వాగుల నుంచి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండానే రవాణా అవుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో.. దృష్టిసారించారు. మండలంలోని వివిధ గ్రామాల వాగుల నుంచి కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించడంతో ఈమేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సబ్‌కలెక్టర్ చొరవతో మండలంలో వారం రోజులుగా ఇసుక అక్రమ రవాణా నిలిచిపోగా.. డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లోని తహసీల్దార్లు, పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టనందున రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అన్ని మండలాల్లోనూ అక్రమ రవాణాను అరికట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులకు సన్మానం

కౌటాల: కౌటాల విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదోన్నతిపై ఆసిఫాబాద్‌కు వెళ్లిన రామ్మూర్తి, కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు వచ్చిన ప్రవీణ్‌కుమార్‌లను.. ఘనంగా సన్మానించారు.

ఏళ్ల నుంచి సమస్యలే!


సాగునీరందక ఎండుతున్న వరి పంట

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

కాగజ్‌నగర్ మండలం ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీలోని పలు గ్రామాల్లో ఏళ్లుగా విద్యుత్తు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కొత్తగా ఏర్పడ్డ కాలనీలోని వాసులైతే కర్రలు పాతుకుని కనెక్షన్లు తీసుకున్నారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిచోట్ల జాప్యం కారణంగా విద్యుత్తు అంతరాయంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇది ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీ విలేజ్ నం.5 శివారులో కొత్తగా ఏర్పడిన కాలనీకి కర్ర స్తంభాలతో వేసిన విద్యుత్తు లైన్. దశాబ్దకాలం కిందట 25 కుటుంబాలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకోవడంతో కొత్తగా కాలనీ ఏర్పడింది. సమీపంలో విద్యుత్తు లైన్ లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అర కిలోమీటరు దూరంలోని వ్యవసాయ కనెక్షన్ల లైన్ నుంచి గృహ వినియోగ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. దీంతో కాలనీవాసులే కర్రలు పాతుకొని లైన్ తీసుకున్నారు. దీంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు సిమెంట్ స్తంభాలతో లైన్ వేయలేదు. ఇక్కడ వ్యవసాయ కనెక్షన్లు ఏడు, గృహ వినియోగ కనెక్షన్లు 25 వరకు ఉండటంతో విద్యుత్తు లోడ్ పెరిగి అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో మీటర్లు కూడా కాలిపోయిన ఘటనలున్నాయి. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు.


విద్యుత్తు లైన్ కోసం కర్రను పాతారిలా..

★ ఇది విలేజ్ నం. 12లోని వ్యవసాయ కనెక్షన్ల తాలుకు నియంత్రిక. ఆరుగురు రైతులకు సంబంధించిన పంట పొలాలు ఉన్నాయి. ఈ నియంత్రిక కాలిపోయి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వరి పంట కళ్లముందే ఎండుముఖం పడుతోంది. పొట్టదశలోనే సాగు నీరందక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏడీఈ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ఘటన స్థలాలను సందర్శించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.


కాలిపోయిన నియంత్రిక


ఇందిరానగర్‌లో అమ్మవారికి మంగళహారతులిస్తున్న మహిళలు


నారాయణపూర్‌లో కుంకుమార్చనలు..


తిర్యాణి: కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

కరుణించు తల్లి.. మహాలక్ష్మి

రెబ్బెన, న్యూస్‌టుడే: ఇందిరానగర్‌లోని దుర్గామాత ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. మంగవారం ఆరో రోజు మహాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ప్రాంగణం రద్దీగా మారింది. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పిల్లల తలనీలాలు అమ్మవారికి సమర్పించారు. నారాయణపూర్ అమ్మవారి మండపంలో కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

తిర్యాణి: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహాలక్ష్మి రూపంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. తెలండి, భీమారం గ్రామాల్లోని మండపాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీదుర్గాభవాని మండపం, ఏరియా వర్క్‌షాప్‌లో నెలకొల్పిన మండపాల్లో కుంకుమార్చనలు, హోమం నిర్వహించారు. జీఎం శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, ఎస్సై చంద్రశేఖర్, ఏఐటీయూసీ ఎస్.తిరుపతి, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యుడు ప్రకాష్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పల్లె ప్రకాష్‌రావు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా జీఎంను ఆలయ నిర్వాహకులు దుర్గం రవీందర్, పూదరి సాయి సన్మానించారు.

బెజ్జూరు, కాగజ్‌నగర్ : మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణం, గోల్కొండ, తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత, శారదా దేవీ మండపాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

దహెగాం: మండలంలోని గిరవెల్లి, చిన్నరాస్పల్లి, పీకలగుండం, దహెగాం, లగ్గాం తదితర గ్రామాల్లోని మండపాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. చిన్నరాస్పల్లిలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. మహాలక్ష్మి అవతారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది.


దహెగాంలో..


జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మండప నిర్వాహకులు రవీందర్, సాయి, తదితరులు


బ్రాహ్మణవాడలోని గాయత్రి దుర్గా మండలిలో..


బెజ్జూరులో..

ఓపెన్ బీట్ మార్కెట్ ఏర్పాటుకు డిమాండ్

వాంకిడి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మండలాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు ఓపెన్ బీట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలిగతి సుచిత్ డిమాండ్ చేశారు. మంగళవారం వాంకిడిలో మాట్లాడుతూ.. ఓపెన్ మార్కెట్ లేకపోవడంతో విచ్చలవిడిగా పత్తి కొనుగోలు కేంద్రాలు వెలిసి రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రైవేటు వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతూ రైతులను మోసం చేస్తూ వస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారులకు చిక్కి కేసులు నమోదైనా వారిలో మార్పురాలేదని పేర్కొన్నారు. రైతులు ధరలో, తూకంలోనూ నష్టపోకుండా ఓపెన్ బీట్ మార్కెట్ చేయాలన్నారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం రవీంద్రఖని-5 గని వద్ద మాట్లాడుతూ లాభాల వాటా పంపిణీపై ఇతర సంఘాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. కార్మికులకు సొంతింటి పథకం అమలయ్యేలా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


గోలేటి టౌన్‌షిప్‌లో బతుకమ్మ ఆడుతున్న సింగరేణి ఉద్యోగుల సతీమణులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలో బతుకమ్మ సంబరాలను మహిళలు ఉత్సాహంగా జరుపుకొంటున్నారు. మంగళవారం వేపకాయల బతుకమ్మను పేర్చి మహిళలందరూ కలిసి ఆడిఆడారు. ఏ గ్రామంలో చూసినా సందడి కనిపిస్తోంది. వృద్ధులు బతుకమ్మ పాట పాడుతూ ఆడుతుంటే యువతులు సౌండ్ సిస్టం ద్వారా నృత్యాలు చేస్తున్నారు.


పిచ్చిమొక్కల తొలగింపు పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో కుమురం భీం వర్ధంతి నిర్వహించనున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం హట్టి నుంచి జోడేఘాట్ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న తీరుని పరిశీలించారు. అనంతరం జోడేఘాట్‌ని సందర్శించారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచండి

కౌటాల, న్యూస్‌టుడే : భాజపా ప్రాథమిక సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు వానుపటేల్, సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇన్‌ఛార్జి ఎల్ములే మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిథున్ కవిరాజ్, నాయకులు సత్తయ్య, భీమన్న, బండురావు, తిరుపతిగౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భాజపా దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. దేశం బాగుండాలంటే భాజపాకు పట్టం కట్టాలన్నారు. పార్టీ సభ్యత్వం కోసం కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. నాగేశ్, ప్రభాకర్, మీసారి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలో భాజపా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ.. వారం రోజుల పాటు కార్యకర్తలందరూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, నీరటి సత్యనారాయణ, అశోక్ ఆర్య, మండల ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఒడ్డెటి నాని, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


కౌటాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పరిశీలించి.. సూచనలు చేసి

వాంకిడి, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రికార్డులను సరిచూసి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంబంధిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను సరిచూసి క్షేత్ర స్థాయిలో సదరు ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగుల సంబంధిత భూముల రికార్డులను క్షుణ్నంగా పరిశీలించాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, మండల శాఖాధికారులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ మండలం మోతుగూడలో ఎల్ఆర్ఎస్ స్థలాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు : కలెక్టర్

వాంకిడి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి విజిలెన్స్ కమిటీ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్, డీవీఏహెచ్‌ఓ సురేష్‌కుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, గణేష్, గోపాల్‌నాయక్, పాల్గొన్నారు.

సంస్థ పురోగతిపై ఉద్యోగులకు అవగాహన

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి అభివృద్ధి, ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉద్యోగుల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు మల్టీ డిపార్టుమెంటల్ కమిటీలు ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించండి

లింగాపూర్, న్యూస్‌టుడే: గర్భిణులకు సాధారణ ప్రసవాల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి తుకారం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని మండల వైద్యాధికారికి సూచించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని, పోటీలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. యువకులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యువజన కాంగ్రెస్ నాయకులు దుర్గం ప్రశాంత్ తదితరులున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పద్మశాలి సేవా సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వేముల బాలరాజు హాజరై అధ్యక్ష, కార్యదర్శులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యవర్గ సభ్యులుగా బూర సమ్మయ్య, గడదాసు నారాయణ, చిలక రామస్వామి, ఉపాధ్యక్షులుగా పుట్ట దత్తాత్రి, పడాల రాజయ్య, పి.సదానందం, వంగర రవికుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెలిమల అంజయ్య, భీమారం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ముందుగా ప్రకటించిన మేరకు మంగళవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అధ్యక్ష స్థానానికి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. లక్కీ డ్రా విధానంలో అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ముక్త శ్రీనివాస్, కొత్త వెంకటేశ్వర్లు, నలమాసు కాంతయ్య, గుల్బం చక్రపాణి, కొలిపాక కిరణ్‌లు వ్యవహరించారు.

రైతు కుమారుడికి సింగరేణిలో మొదటి ర్యాంకు

దహెగాం, న్యూస్‌టుడే : కుమురంభీం జిల్లా దహెగాం మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబమైన రుషి-శారద దంపతుల కుమారుడు లంగారి ప్రసాద్.. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) పరీక్ష ఫలితాల్లో మెరిశారు. ఆగస్టు 7న పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి. అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీలో ప్రసాద్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.


కుమారుడు ప్రసాద్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

కుమురం భీం వర్ధంతికి పీవోకు ఆహ్వానం

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న కుమురం భీం వర్ధంతి దర్బార్‌కు రావాలని కోరుతూ.. మంగళవారం భీం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు ఆహ్వానం పలికారు. ఉట్నూర్‌లోని పీవో కార్యాలయంలో భీం వర్ధంతి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్, కన్వీనర్ పెందుర్ మోతీరాం సభ్యులు జగన్నాథ్‌రావు, మడావి రాజు, సిడాం ధర్ము, దుందేరావు పాల్గొన్నారు.


ఉట్నూరులో భీం వర్ధంతి గోడప్రతులు ఆవిష్కరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా, తదితరులు